



# బలం తగ్గింది మరి!

పసుపు, తెలుపు, చిలకాకుపచ్చ, నీలంరంగు లాల్చీలూ, పేడంచు పంచె, నల్లకళ్ళద్దాలూ, చేతికి యాభై(గ్రాముల రాయంత బరువుండే వాచీ, తోలు చెప్పులు వేసుకునే పిల్లినాగన్న గురించి కాస్త ఎక్కువగానే చెప్పుకునేవాళ్ళం. అతన్ని సోకుల నాగన్న అని చెప్పికూడా పిలిచేవాళ్ళం. ఈ నాగన్నగురించి మాటాడుకునేటప్పుడు చారల పేంటూ, లూజు గళ్ళ చొక్కాలూ, బూతద్దాల కళ్ళజోడు పెట్టుకునే మట్టపర్తి నారాయుడు గురించి కూడా మాటాడుకునేవాళ్ళం. వీళ్ళిద్దరూ చాలా క్లోజు. ఏం చేసినా కల్సి చేస్తారు. విడిగా ఏదీ చెయ్యరు.

పగలంతా ఎక్కడెక్కడో తిరిగిన పిల్లినాగన్నా, మట్టపర్తినారాయుడూ రాత్రయ్యేసరికి కిళ్ళీరన్న హొటేల్లోకి జేరేవారు. పంచె మడతల్లో దాచిన ప్లాస్టిక్ సారా సంచుల్ని ముందు పళ్ళతో పీకి సీవండి గ్లాసుల్లోకి పోసుకుని, వామ్మూ ఉప్పూ, చింతపండూ కలిపి పెట్టిన మిరపకాయబజ్జీలు కొనుక్కుని తింటూ సారాని చప్పరిస్తూ మాటాడుకునేవారు. మందుకొట్టడం అయిపోయిన తర్వాత రాత్రి భోజనానికి



మట్టపర్తినారాయుడు ఇంటికెళ్ళేవారు. నారాయుడు పెళ్ళాం కామేశ్వరి నీచుకూరలు బాగా వండుద్ది.

పిల్లినాగన్నా వాడి తమ్ముళ్ళూ కల్సి దొంగతనానికి వెళ్ళేప్పుడు ఎప్పుడో మిద్దెమీద చెద పట్టేసున్న పంచాంగాన్ని తీసి బూజుల్ని దులిపేసి ఆ పేజీల్నీ తిరేగేస్తా, ఆవేళ దొంగతనానికి వెళ్ళేవాళ్ళ జాతకాలూ, ఏయేరోజులు ఏ ఏ వస్తువులు ..ఏ ఏ రోజుల్లో దొంగతనం చెయ్యడానికి వీలుగా ఉంటాయి. తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం దిక్కుల్లో ఏ దిక్కు కెళితే బాగుంటుంది. తిథులూ, నక్షత్రాలూ, వారం, వర్జం చూసి, వేళ్ళమీద లెక్కలు గట్టి ముహుర్తాలు పెడతాడు మట్టపర్తినారాయుడు.

* * *

జమ్మిసూర్యనారాయణగాడి పందెంకోడి కుయ్యకముందే లేచిపోయిన ఇద్దరూ ముఖాలు కడుక్కుని రెడీ అయిపోయి కిళ్ళీరన్న

హొటేల్లో పొగలు కక్కుతున్న ఉప్మాలో కారం చెట్నీ వేసుకు తిని స్ట్రాంగు టీలు తాగి రాత్రి దోచుకున్న సంచుల్ని జబ్బలకి తగిలించుకుని బస్సెక్కి బయల్దేరతారు.

రాజమండ్రీ, కాకినాడల్లో ఉన్న పెద్ద పెద్ద బట్టలకొట్లల్లో దొంగతనానికి వెళ్ళాలంటే వాళ్ళ దగ్గరున్న ఖరీదైన వస్తువులూ, గిల్టునగలూ, వాచీలూ పట్టుబట్టలూ, ద్రాక్షారామం అత్తరు సాయిబుగాడి దగ్గర కొట్టేసిన సెంట్లు రాసుకుని మరీ వెళతారు. వీళ్ళని చూసిన మార్వాడీ వీళ్ళకి లేటెస్ట్‌గా వచ్చినవి చూపించమని చెపుతాడు పనోళ్లకి. పిల్లినాగన్న తనకు తెల్సిన పల్లెటూరి నాలెడ్జీతో అడిగేసరికి వీళ్ళ వాలకం చూస్తుంటే ఈ రోజు మాషాపులోని బట్టలు పెద్ద మొత్తంలోనే కొనేసేలా ఉన్నారు అనుకుని ఎక్కడెక్కడో దాచిన చీరలూ, లేటెస్ట్ ప్యాంటు బిట్లూ, చొక్కాబిట్లూ తెచ్చి చూపిస్తుంటే నానారకాలుగా ఆడ్డి అడిగి "అది నచ్చలేదూ... ఇది నచ్చలేదూ... ఇవన్నీ మా పిల్లలెప్పుడో తొడిగేసారు. కొత్తగా వచ్చినవి ఏవన్నా ఉంటే అయ్యి చూపించవయ్యా.." అని దబాయిస్తా ఒక పక్కనించి మూడోకంటోడికి కనపడకుండా నచ్చిన చీరలూ, చొక్కాముక్కలూ నేలకి తగిలేలా కిందకి వేలాడేసిన పంచి మడతల్లోకి తోచేస్తారు. గంటా రెండు గంటల పాటు బట్టలు తీసి తీసి అలిసిపోయిన కుర్రోళ్ళని కసురుకుంటూ "మీ కొట్లో సరుకు అంతగా నచ్చలేదు ఈసారొచ్చినపుడు ఏవైనా మంచిగుడ్డలుంటే తీసుకుంటాం" అని శేఠుకి చెప్పి సడీ చప్పుడు లేకుండా అక్కడ్నించి జారుకుంటారు పిల్లినాగన్న అన్నదమ్ములు.

వారం పదిరోజులు పాటు మట్టపర్తి నారాయుడుగాడు పెట్టిన ముహుర్తాల ప్రకారం దొంగతనాలు పూర్తిచేసుకుని వూళ్ళోకి దిగి సరుకంతా నాగన్న ఇంట్లో పడేస్తారు.

రాజమండ్రీ, కాకినాడా, మండపేట షాపులోళ్ళు వేసిన లేబుల్స్ పీకేసి మెడ్రాసులో ఉన్న రత్నాస్టోర్స్, శరవణాస్టోర్స్, వల్లీ షాపులకి సంబంధించిన డూప్లికేటు స్టిక్కర్లు అంటించి ఆడోళ్ళకి చూపిస్తా "ఇది కంచి పట్టు, ఇది బెనారస్, ఇది సేలం.."అంటూ "ఇదే చీర మీరు మండపేట, రాజమండ్రిలోగానీ అడిగితే డబల్ చెపుతాడు. నేను కాబట్టి మీకు చాలా చవగ్గా అమ్ముతున్నాను" అంటా నోటికొచ్చింది వాగుతాడు.

వీడు కొట్టుకొచ్చిన వస్తువులు తీసుకొచ్చి మనకే తోకడా వేసేస్తున్నాడని తెల్సిన ఆడాళ్ళు వాడికి పై ఎత్తులో, చాలా నేగ్గా బుట్టలో పడేస్తా ఆడు చెప్పిన రేటుకి మూడింతలు తగ్గించి బేరమాడతారు. "మీరడిగిన ధర కిట్టుబాటవ్వదు నాకు" అని వెళ్ళిపోతుంటే "ఈసారికి ఇలా కానీయ్యండి నాగన్నగారు. మళ్ళీసారి తెచ్చినపుడు డబలేసుకుందిరిగానీ" అని వేళాకోళాలాడేవారు ఆడాళ్ళు. ఆడుకాదూ కూడదు అని ఒప్పుకోకండా వెళ్ళిపోతుంటే "మీరెప్పుడు తెచ్చినా మాకు బేరం అతకనివ్వరు అదే ఆ పక్కింటోళ్ళు మాకంటే తక్కువ ధరకి అడిగినా ఇచ్చేస్తారు" అని నసిగే సరికి ఆళ్ళమాట కాదనలేక "ఇంకో రూపాయి కట్టుకోండమ్మా" అని చెప్పి ఇచ్చేసేవాడు నాగన్న.

* * *

కాలం గడుస్తుంది.

మట్టపర్తినారాయుడు దొంగతనాలు చెయ్యడానికి ముహుర్తాలూ మీద ముహుర్తాలు పెడుతానే ఉన్నాడు. వీళ్ళు యధాప్రకారం దొంగతనానికి వెళ్తావస్తా ఉన్నారు. వస్తువులు తెస్తూనే ఉన్నారు. వాటిని ఆడాళ్ళు కొంటానే ఉన్నారు. దాంతో, ఆ ఆడోళ్ళు పట్టణం వెళ్ళి కొనకండా వాళ్ళకేం కావాలన్నా నాగన్నకి పురమాయించుకుని తెప్పించుకుంటున్నారు.

దాంతో, వూళ్ళో పిల్లినాగన్న పేరెల్లిపోయేడు.

డబ్బున్న ఆడోళ్ళంతా నాగన్న దగ్గర వస్తువులు చవకధరకి కొనేస్తున్నారని చూసిన ఎండిచేపల ఈరమ్మ "మా నల్లపిల్ల దుర్గని ఉప్పాడలో మా మేనల్లుడికిచ్చి చేస్తున్నాం. మొన్న నేను వెళ్లినప్పుడు ఈ పెద్ద పండక్కి కట్నం కింద ఉంగరం పెట్టవే అత్తా అన్నాడు. మా

మేనల్లుడికి పండగ కట్నంగా పెట్టడానికి చవగ్గా బంగారపు ఉంగరాలేవైనా తెచ్చిపెడుదురు'' అంది.

చూపుడు వేలికి తగిలించుకున్న పగడం ఉంగరం తీసి ''ఇది కాసుపైనే ఉంటుంది బంగారం కొట్లో కొంటే మూడువేలు పైనే ఉంటుంది. మీ మేనల్లుడికి అంటున్నావు కాబట్టి ఓ వెయ్యిరూపాయిలిచ్చి తీసేసుకో'' అన్నాడు నాగన్న.

ఉంగరాన్ని ఎగాదిగా చూసి ''ఈ బంగారం మంచిదేనంటారండీ'' అంది.

నవ్వేసిన నాగన్న ''ఈ ఉంగరం నాకు రాశి. నువ్వేదో అల్లుడికి అన్నావు కదానిచ్చేను'' అంటా కసురుకునేసరికి కంగారు పడిపోయిన ఈరమ్మ ''ఏవన్నా బెట్టు చేస్తే వెనక్కి లాగేసుకుంటాడేమోనని'' కంగారు పడిపోయి బొడ్డు చెంగులో దోపిన గోతం లోంచి ఆరోజు ఎండు చేపలమ్మిన డబ్బులు చిల్లరతో సహా వెయ్యిరూపాయలు లెక్కగట్టి పిల్లినాగన్న చేతిలో పోసింది.

కొన్నాళ్ళయ్యేక ఖర్చులకి డబ్బులు లేక అత్తగారు ఈరమ్మపెట్టిన ఉంగరం తాకట్టు పెడదామని వెళ్ళిన అల్లుడ్ని ''గిల్టు నగ తెచ్చి మమ్మల్నే మోసం చేద్దాంవనుకున్నావురా'' అని చావగొట్టి బొక్కలోకి తోయించేశారు ఆ కాకినాడ మార్వాడీలు.

వారం పదిరోజులకి బొక్కలోంచి బయటికొచ్చిన ఈరమ్మ అల్లుడు ''మీ అమ్మ రోల్డుగోల్డు నగ పెట్టి నన్ను మోసం చేసిందే'' అంటూ నల్లపిల్ల దుర్గని ఈరమ్మ ఇంటికి తోలేశాడు. అక్కడ్నించి పిల్లినాగన్న ఎప్పుడు కనపడినా ''గొల్లిగా నీ వల్లే మా నల్లపిల్ల కాపరం చెడిపోయిందిరా''అని చెప్పి దుమ్మెత్తిపొయ్యడం మొదలెట్టింది ఎండిచేపల ఈరమ్మ.

* * *

రోజులు గడుస్తున్నాయి.

దొంగతనాలు చెయ్యడంలో ఆరితేరిన నాగన్నకి, ముహుర్తాలు పెట్టే నారాయుడికి డబ్బులు రెండుచేతుల్లో ఆడుతున్నాయి. దాంతో పాటు అలవాట్లుకూడా బాగా పెరిగినియ్యి.

ఇరవైనాలుగ్గంటలూ నాటు సారాలోనే మునిగి తేలుతున్న మట్టపర్తినారాయుడికి గుండె పోటొచ్చింది. డాక్టరు ఉప్పు భద్రంగారింటికి తీసుకెళదామనుకుంటుండగానే నారాయుడు ప్రాణాలు పరలోకంలో కల్సిపోయినియ్యి.

దాంతో పిల్లినాగన్నకి, తన చెయ్యీ, కాలూ ఎవరో ఫళుక్కుమని విరిసేసినట్టయిపోయింది.

దొంగతనాలకి వెళ్ళడానికి సరైన ముహుర్తాలు పెట్టేవాడు లేక నానాఅవస్థలూ పడ్తున్నారు. ''ముహుర్తం చూసుకుని బయల్దేరకపోతే మనం దొంగతనం చెయ్యలేమా'' అని వాళ్ళలో వాళ్ళే కూడబలుక్కుని పిఠాపురం సంతకి బయల్దేరారు.

సంతలో చాలాచోట్ల దొంగతనాలు చేసే ప్రయత్నం చేసిన వాళ్లు ఒక షాపులో రేడియో కొట్టేద్దామని నాల్గైదు రకాల రేడియోలు చూసి బేరమాడారు. ఇవేం మాకు నచ్చలేదు, ఇంకా కొత్తగా వచ్చిన సరుకుంటే చూపించండి అనేసరికి తీసుకురావడానికి లోపలికెళ్తూ వెనక్కి తిరిగేచూసేసరికి నాగన్న పంచెమడతల్లో పెడ్తున్న రేడియోని చూసేసి ''దొంగలు... దొంగలు... పట్టుకోండి..పట్టుకోండి..'' అని పెద్ద పెద్ద కేకలు పెట్టేసరికి, ఆడి అరుపులకి కంగారు పడిపోయిన వాళ్ళు కొట్టేసిన వస్తువులు అక్కడే పాడేసి పరుగు లంకించుకున్నారు.

వాళ్ళ పరుగులు చూసిన సంతలో ఉన్న జనమంతా వెంటపడ్డారు. వాళ్ళకళ్ళు గప్పి బయటపడేసరికి వాళ్ళచెరనుంచి తప్పించుకోవడానికి తలప్రాణం తోక్కి వచ్చింది.

మొత్తం మీద పిఠాపురం సంతలో ఉన్న షావుకార్ల చేతికి చిక్కకుండానే పొలిమేర దాటేశారు.

* * *

పిల్లినాగన్న అన్నదమ్ములంతా దొంగతనాలు చెయ్యలేక చేతిలో డబ్బులు ఆడక పొరుగూళ్ళెళ్ళిపోయేరు.

ఎటూ కదల్లేని నాగన్న మట్టుకి ఊళ్ళోనే ఉండిపోయేడు.

పైసా ఆదాయం లేక తాగడానికి, తిండానికిక్కూడా డబ్బుల్లేక అడుక్కు తినేదశ కొచ్చిన నాగన్న పిచ్చోడై తిరుగుతున్నాడు వీధులమ్మట.

వారానికో పదిరోజులకో పెద్దీధిలోనూ, సంతపేటలోనూ, గోపుడితోట దగ్గరా కనపడిన నాగన్నని ''నాగన్నగారు ఈ మధ్య మెడ్రాసు వెళ్ళడం లేదా, పెద్దగా బట్టలు తీసుకురావడం లేదా'' అంది ఒకావిడ. మండువాలోగిట్లోంచి బయటికొస్తూనే ''పిల్లని అత్తారింట్లో వదలాలి వీపరాలికి ఇయ్యంకుడికీ బట్టలెట్టాలి తీసుకొస్తారేంటని'' ఒకావిడ, ''శ్రావణ శుక్రవారం పూజ దగ్గర పడ్తుంది లక్ష్మీదేవి పూజ దగ్గర కట్టుకోవడానికి పట్టుచీరేపైనా ఈ వారంలో తెస్తారేంటని'' ఒకావిడ ఇలా రకరకాలుగా అడుగుతున్నారు.

దాంతో వాళ్ళకి సమాధానాలు ఏం చెప్పాలో తోచని పిల్లినాగన్న ''కుప్పనూర్పులు హడావిడిలో పడి వెళ్ళలేక పోతున్నాను. ఖాళీ చూసుకుని వెళతా'' నని ఆ ఆడోళ్ళు కంట పడకండా తప్పించుకు వెళ్ళడానికి ప్రయత్నించేవాడు.

* * *

సంక్రాంతి రోజులొచ్చినియ్యి.

మా చుట్టు పక్క టౌన్లలో ఉన్న బట్టలకొట్లన్నీ ఇసకేస్తే రాలనంత జనంతో కిటకిట లాడిపోతున్నాయి.

ఒక పక్కనించి నాగన్నగారూ ''ఈ పండక్కి బట్టలేం తీసుకురాడం లేదా'' అంటా తినేస్తున్నారు ఆడాళ్ళు.

ధైర్యం చేసిన పిల్లినాగన్న ద్వారపూడిసంతలోకి బయల్దేరాడు. సంతంతా తిరుగుతున్నాడుగానీ, ఏ వస్తువు దొంగతనం చెయ్యడానికీ ధైర్యం చాలడం లేదు. పైగా కాళ్ళూ చేతులూ వణుకుతున్నాయి. కణతల దగ్గర చెమటలు పడుతున్నాయి. నాలుగైదు కొట్లు తిరిగిన నాగన్న ఎప్పటికో ధైర్యం చేసి ఒక బట్టలకొట్లోకెళ్ళాడు. వణుకుతున్న కంఠంతో రకరకాల చీరలూ, ఫేంట్లూ, షర్టులూ బేరమాడుతున్నాడు. వాడి వాలకం చూసిన కొట్టోడికి డౌటొచ్చింది.

అదే టైంలో కొట్లో దొంగతనం చెయ్యడానికి వచ్చిన ఇంకో దొంగలగుంపు దొరికిపోయారు ఆ కొట్లోళ్ళకి. ఆ హడావుడిలో నాగన్నకూడా వాళ్ళ తాలూకే అనుకుని పట్టుకుని సంతలో ఉన్న పెద్ద వేపచెట్టుకి, కొబ్బరిపీచు తాళ్ళతో కట్టేసి, చింతజూకతో, చేతికర్రతో ఎవడికి దొరికినవి వాడు తీసుకుని ముక్కులమ్మటా, చెవులమ్మటా రక్తాలొచ్చేలా కొడుతుంటే చూసిన వాళ్ళకి ఈరోజుకీ వళ్ళంతా జలదరిస్తానే ఉంటది.

అలా సాయంత్రం నాలుగ్గంటల దాకా పచ్చిమంచినీళ్ళుకూడా ఇవ్వకండా ఆ దొంగలందర్నీ కొట్టడమేగాకండా పిల్చి గుళ్ళు గీయించి, సున్నంబొట్లు పెట్టించి ఇంటర్నేషనల్ ట్రాక్టరు ట్రక్కుమీద నాలుగుగుంజలు పాతి ఆ గుంజలకి కట్టేసి ఆ ద్వారపూడి సంతలోనూ, ఊళ్ళోనూ మాదిగడప్పులు వాయిస్తా ఊరేగించి పోలీస్టేషన్లో అప్పగించారు.

స్టేషన్నించి వచ్చిన దొంగపిల్లినాగన్న మామూలుగా అడుక్కునే ప్రయత్నాలు చేసేడుగానీ ఈ దొంగనాకొడుకు అడుక్కుంటున్నాడంటే వెనకేదో పెద్దప్లానే ఉందని మళ్ళీ చావగొట్టేరు. ఇలా అడుక్కోడం వెనకేం ఆలోచించేవురా ఎదవ తత్తుకొడకా అంటా పీకమీద కాలేసి కసాపిసా తొక్కేసేరు. ఎర్రమట్టిదుమ్ములో దొర్లించేసేరు. దాంతో తన బలం తగ్గడానికి కారణమైన మట్టపర్తి నారాయుడ్ని తల్చుకున్నాడు తిట్టుకున్నాడు. ''ఇక బతకడం ఎలాగరా బగమంతుడా?'' అని ఏడుస్తున్నాడు.

* * *